క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : స్థానిక టౌన్ టూ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, యు.కొత్తపల్లె వై జంక్షన్ నుంచి బేతంచెర్ల 44బి.జాతీయ రహదారి పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీనివాసనగర్, మాదన్ననగర్, కంభాలపాడు రోడ్డు, ఇందిరానగర్, నెహ్రూనగర్‌తో పాటు గుత్తి రోడ్డులోని వంద పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, దొరపల్లె ఫ్యాక్టరీలు,రైల్వే స్టేషన్, చిగురమానుపేట ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదన్నారు.

స్టూడెంట్ కిట్స్ అందజేస్తాం

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్స్ అందజేస్తామని ఎంఈఓ స్వరూప తెలిపారు. ఈ మేరకు శనివారం వచ్చిన షూస్, సాక్స్ బాక్స్‌లను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదుల్లో నిల్వ చేశారు. బాలురకు 4,426 జతలు కలిగిన 85 బ్యాగ్‌లు, బాలికలకు సంబంధించి 4,686 జతలు కలిగిన 86 బ్యాగ్‌లతో పాటు 18,626 జతల సాక్స్‌లు వచ్చాయని ఎంఈఓ తెలిపారు. వీటిని మండలంలోని ఆయా పాఠశాలలకు అందజేయ నున్నట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. వీటిని ఆయా స్కూళ్లకు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు సుధాకర్‌రావు, శివప్రసాద్, శివ రామమద్దిలేటి, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అవుకు: ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు కర్నూలు జిల్లా రజక సాధికార కమిటీ మెంబర్ కేశవర్ధన్ శనివారం తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలలోని రజక విద్యార్థులు పదవ తరగతిలో 450 మార్కులు, ఇంటర్‌లో 850, డిగ్రీ, బీటెక్‌లో 80శాతం మార్కులు, ఎంసెట్, నీట్‌లో 10వేలలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కర్నూలు జిల్లా రజక విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేస్తుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు జూలై 31వ తేదీలోపు సెల్ నంబర్లు 9110396511, 9182708114, 7780506001, 9966986297 సంప్రదించాలని సూచించారు.

సాగు మెలకువలపై అవగాహన కల్పించాలి

బేతంచెర్ల: ఖరీఫ్ సాగు మెలకువలపై అగ్రికల్చర్ అసిస్టెంట్స్ రైతులకు అవగాహన కల్పించాలని ఏఓ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. రైతులు సాగు చేస్తున్న పంటలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విత్తన పంపిణీ, పీఎం కిసాన్, కౌలుదారుల పత్రాలు, ఎరువుల స్టాక్ అంశాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, మహమ్మద్, బెన్నీ రాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

డోన్ రూరల్ : ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఈ వ్యసనాలతో విద్యార్థులు, యువకులు జీవితాలను నాశనం చేసుకోవద్దని నంద్యాల జిల్లా సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శనివారం మత్తు, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికలు అలవాటు చేసుకొని మన దేశ ప్రగతికి, సమాజానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ సోమశేఖర్‌రావు, కళాశాల కరస్పాండెంట్ కుల్లాయిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా మధు శేఖర్

బేతంచెర్ల: సీపీఎం మండల నూతన కార్యదర్శిగా మధు శేఖర్‌ను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, సీపీఎం కార్యవర్గ సభ్యులు నాగరాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

డోన్ టౌన్ : పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న వైద్య పాలి క్లినిక్‌లో ఆదివారం కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ డాక్టర్ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆలా మధు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు డాక్టర్లు కంటి పరీక్షలు చేస్తారన్నారు. అవసరం మేరకు మరుసటిరోజు ఉచిత సౌకర్యాలతో కర్నూలు సుశీల నేత్రాలయ ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్సలు చేయిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శుద్ధ జలం.. పదిలమేనా?

- పల్లెల్లోనూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే ప్లాంట్ల నిర్వహణ
- రుచి కోసం కెమికల్స్ కలుపుతున్న కొందరు నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



ప్యాపిలి: ప్రజల జీవనశైలి పూర్తిగా మారిపోయింది. చాలా వరకు విలాస జీవన విధానానికి మొగ్గ చూపుతున్నారు జనం. గ్రామీణులు సైతం పట్టణ జీవనశైలిని అలవర్చుకుంటున్నారు. వస్త్రాధరణ, వాహనాలు, ఆహారపు అలవాట్లు తదితరాలు పూర్తిగా మారిపోయాయి. ఇందులో ప్రధానమైనది మినరల్ వాటర్. ఒకప్పుడు పట్టణ ప్రజలు మాత్రమే అలవడిన మినరల్ వాటర్ వినియోగం ఇప్పుడు గ్రామాలకూ పాకింది. దీంతో మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొందరు అక్రమార్కులు విచ్చలవిడిగా సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రంలో 9 వాటర్ ప్లాంట్లు ఉండగా వివిధ గ్రామాల్లో మరో 10 ప్లాంట్లు ఉన్నాయి. ఇవన్నీ పేరుకే మినరల్ వాటర్ ప్లాంట్లు..అయితే వీటిలో నాణ్యతాప్రమాణాలు మచ్చుకైనా కనిపించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంత స్థలం, బోరు ఉంటే చాలు ఎలాగైనా అనుమతులు తెచ్చుకుని ఆర్వో ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. సాదాసీదా క్యాన్‌లలో నీరు నింపి విక్రయిస్తున్నారు. ఈ నీటిని తాగడం మూలంగా జుట్టు రాలిపోవడం, అతిసారా, కిడ్నీ సంబంధిత వ్యాధులు ప్రబలుతాయని వైద్య నిపుణులు చెబుతున్నా ఎవ్వరికీ వినపడడం లేదు. దీంతో కనీస నిబంధనలు పాటించకుండా శుద్ధ జలం అంటూ సొమ్ము చేసుకుంటున్నారు కొందరు అక్రమార్కులు. శుద్ధ జలం పదిలమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చౌకగా ప్లాంట్ల నిర్వహణ

అంతర్జాతీయ ప్రమాణాలు పాటించి వాటర్‌ప్లాంట్లను నిర్వహించాలంటే భారీ మొత్తం వెచ్చించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లను రూ. 3 లక్షల లోపు పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేసుకున్నారు. బోరు సౌకర్యం ఉంటే ఒక చిన్న గదిని ఏర్పాటు చేసుకుని అందులోనే ప్లాస్టిక్ ట్యాంకును ఏర్పాటు చేస్తున్నారు. చౌకగా లభించే ప్యూరిఫైడ్ మిషనరి ద్వారా నీటిని శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. సోడియం, కార్బొనేట్, సోడియం క్లోరైడ్, శాక్రిన్ కలిపి నీటికి తియ్యని రుచి తెస్తున్నారు. ఈ నీటికి ల్యాబ్ టెస్టింగ్, వాటర్ క్యాన్లపై తయారీ తేదీ కూడా ఉండదు. ఇవన్నీ లేకుండా విక్రయిస్తున్నా అధికారుల్లో చలనం లేదు.

ఇష్టారాజ్యంగా ధరలు!

వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు 20 లీటర్ల క్యాన్‌ను తమకు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు. ప్లాంటు దగ్గర అయితే ఒక రేటు, డోర్ డెలివరీ అయితే మరో రేటు ప్రకారం సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క క్యాన్‌కు రూ. 12 నుంచి రూ. 20 వరకు వసూలు చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

వాటర్ ప్లాంట్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. గ్రామ పంచాయతీ అధికారులు, వైద్యాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తరచూ ప్లాంట్లను తనిఖీ చేసి ప్రమాణాలు పాటించని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వాటర్ ప్లాంట్ల నిర్వహణకు నిబంధనలు ఇలా ఉన్నాయి....

- ప్లాంట్ నిర్మాణానికి 2,200 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించాలి
- నీటిని నిలువ ఉంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులనే వాడాలి
- పంపింగ్ చేసేందుకు కూడా స్టెయిన్‌లెస్ స్టీల్ పైపులనే వాడాలి
- అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రివర్స్ ఆస్మాసిస్ ప్రక్రియ ద్వారా నీటిని శుభ్రపరచాలి
- నీటిలోని వైరస్, బ్యాక్టీరియాను నిర్మూలించడానికి అల్ట్రా వైలెట్ సిస్టం పాటించాలి
- బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- శుద్ధి చేసిన నీటిని నిపుణుల ద్వారా పరీక్షించిన తర్వాతే విక్రయించాలి
- రేడియో యాక్టివిటి టెస్ట్, ప్యాకింగ్ మెటీరియల్ టెస్ట్, కంప్లీట్ అనాలసిస్ ఇన్‌క్లూడింగ్ పెస్టిసైడ్ టెస్టులతో పాటు అనేక పరీక్షల అనంతరం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ కంపెనీ ఐఎస్ఐ ధృవీకరణ పత్రాన్ని మంజూరు చేస్తుంది.

ఆదేశాలు జారీ చేశాం



మండలంలోని అన్ని మినరల్ వాటర్ ప్లాంట్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు చేశారు. నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీ చేశాం. ప్లాంట్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పాం. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శుల ద్వారా హెచ్చరికలు జారీ చేశాం. నీటి నాణ్యతా ప్రమాణాలపై ఫిర్యాదులు వస్తే సదరు ప్లాంట్‌ను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

– బాలకృష్ణుడు, ఈఓఆర్డీ

సేవలతోనే గుర్తింపు



శంకరయ్యను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రజలకు చేసిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి 2 రామనర్సప్ప, కృష్ణగిరి మండల మాజీ అధ్యక్షుడు కేఈ జయన్న పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్లో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పోతుదొడ్డి హైస్కూల్ హెచ్‌ఎం శివశంకరయ్య పదవి విరమణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శివశంకరయ్యకు ముఖ్య అతిథులతోపాటు ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి మెమొంటోలతో సత్కరించారు. అదేవిధంగా పూర్వ విద్యార్థులు శివశంకరయ్య పాదాలు కడిగి గురుభక్తి చాటుకున్నారు.

మహిళ అదృశ్యం



ఇందిర(ఫైల్)

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన వివాహిత ఇందిర అదృశ్యం అయినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపాల్ శనివారం తెలిపారు. గోస్పాడు మండలంలోని యాళ్లూరు గ్రామానికి చెందిన ఇందిర పలుకూరు గ్రామానికి చెందిన బాలతిమ్మరాజుతో ఏడేళ్ల క్రితం వివాహం అయ్యింది. కుటుంబ సభ్యులకు బజారులో పని ఉందని చెప్పి వెళ్లింది. అయితే తిరిగి రాకపోవడంతో బంధువులు స్నేహితుల వద్ద విచారించిన ఆచూకి తెలియలేదు. భర్త బాలతిమ్మరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, ఐసీడీఎస్ అధికారులు

డోన్ : మూడేళ్లు నిండిన చిన్నారులను సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, వారి మానసిక, శారీరక ఎదుగుదలకు తల్లిదండ్రులు తోడ్పడాలని సీడీపీఓ షంషాద్‌బేగం సూచించారు. స్థానిక రైల్వే ఏరియాలోని త్రివర్ణ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం 8 మంది అంగన్‌వాడీ విద్యార్థులను చేర్పించిన సందర్భంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పరమేశ్వరి, శోభారాణి, తిమ్మమ్మ, దేవకృప, సుగుణమ్మ, రాధమ్మ, శకుంతల, ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సరితబాయి, సులోచన, సుమలత, మణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: పట్టణ సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరి మాత ఆలయంలోని నూతన కల్యాణ మండపంలో శనివారం జ్యేష్ఠ మాస పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు నరేశ్ శర్మ వేద మంత్రాలు చదువుతుండగా స్వామివారి కల్యాణం కమనీయంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హుసేన్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, రాఘురామిరెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, బూషిరెడ్డి, ఉన్నం శేఖర్, గూని నాగరాజు, నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

26న మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్ : స్థానిక మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్స్‌పాల్ జాస్మిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో రెండు సీట్లు , 8వ తరగతిలో రెండు, 9వ తరగతిలో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్షలకు 24, 25తేదీల్లో స్కూల్ వద్ద దరఖాస్తులు నింపి హాల్‌టిక్కెట్ పొందవచ్చన్నారు. 9వ తరగతిలో ప్రవేశం కోరకు హాజరయ్యే విద్యార్థులు 8వ తరగతిలో స్టేట్ సిలబస్ లేదా సీబీఎస్ఈ సిలబస్ అనే విషయాన్ని స్టడీ సర్టిఫికెట్ మీద రాయించుక రావాలని సూచించారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



కుర్చీలను అందజేస్తున్న వివేకానంద సేవా సమితి సభ్యులు

డోన్ టౌన్ : ప్రతిఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మలిశెట్టి జగన్‌మోహన్, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి తెలిపారు. పట్టణంలోని తారకరామనగర్ పార్కులో నూతనంగా నిర్మించిన ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యాలయానికి శనివారం వివేకానందసేవా సమితి సభ్యులు 25 ప్లాస్టిక్ కుర్చీలను అధ్యక్షురాలు ధ్యానప్రియ షాలినికి అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఎదురెదురుగా లారీలు రావడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

మార్కెట్ రోడ్ అంతే...!

బనగానపల్లె : నియోజకవర్గ కేంద్రం బనగానపల్లెలో ప్రధాన రహదారులు విశాలంగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రధాన రోడ్లు విస్తరించడంతోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే మార్కెట్ రోడ్ మాత్రం ఇరుకుగానే ఉంది. నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతూనే ఉంటుంది. చివరకు ప్రతిఒక్కరూ మార్కెట్ రోడ్ అంతే అనే పరిస్థితి నెలకొంది. రోడ్డు ఇరుకుగా ఉండడం... భారీ వాహనాలు ఈ రహదారిపై వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతూనే ఉంటుంది. మహాసిమెంట్, రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీల భారీ వాహనాలు కూడా ఈ రహదారిపైనే వెళ్తున్నాయి. భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ట్రాఫిక్ క్లియర్ అయ్యేందుకు గంట సమయం పట్టిన సందర్భాలు లేకపోలేదు. అధికారులు స్పందించి ఈ రహదారిని వన్‌వే మార్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు దారుణం

- టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయాలి
- దాడులు పునరావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లక్ష్మీ నాయుడిని పరామర్శిస్తున్న కాటసాని రామిరెడ్డి

అవుకు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేయటం దారుణమని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మండిపడ్డారు. కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురం గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడి అవుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ లక్ష్మినాయుడు, ఆయన కూతురు వరలక్ష్మిని శనివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సోదరుడు కాటసాని తిరుపాల్ రెడ్డి పరామర్శించారు. వీపుపై కందిపోయిన గాయాలను చూసి కాటసాని చలించిపోయారు. ఆరోగ్య పరిస్థితిని బాధితుడి భార్యను అడిగి తెలుసుకున్నారు. బాధితులతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చిన కాటసాని అధైర్యపడొద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పైశాచికంగా రోడ్డు వెంట ఈడ్చుతూ దాడి చేయడం దారుణమని, ఆడబిడ్డపై సైతం దాడులు దారుణమని మండిపడ్డారు. కొలిమిగుండ్ల మండలంలో టీడీపీ శ్రేణులు మరీ రెచ్చిపోతున్నారని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతోపాటు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దాడులను ప్రోత్సహిస్తున్నారని, ఇలాంటి చర్యలు ఏమాత్రం సమంజసం కాదని సూచించారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎలాంటి గొడవలు జరగలేదని, ఫ్యాక్షన్ గ్రామాల ప్రజలు సైతం ప్రశాంతంగా జీవనం సాగించారని గుర్తు చేశారు. ఇప్పుడేమో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో టీడీపీ కార్యకర్తలు... వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూనే ఉన్నారని విమర్శించారు. దాడులు పునరావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



గాయాలు చూపుతున్న బాధితుడు



చికిత్స పొందుతున్న వరలక్ష్మి

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడుతున్నారని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కార్యకర్తలకు నేనున్నానంటూ భరోసానిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు ప్రేరేపిస్తున్నారని, అధికారం శాశ్వతం కాదన్నారు. దాడులు జరిగినప్పుడు బాధితులకు అండగా నిలువాల్సిన పోలీసులు సైతం ప్రేక్షక పాత్రపోషించడం సమంజసం కాదన్నారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధిత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సర్దుకపోవాలని పోలీసులు ఉచిత సలహాలిస్తూ కేసు నమోదు చేయకపోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. జిల్లా ఎస్పీ స్పందించి దాడులు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడిన టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ వర్కర్స్‌కు కనీస వేతం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న లలితమ్మ

డోన్ రూరల్ : అంగన్‌వాడీ వర్కర్స్‌కు కనీస వేతం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు జె.లలితమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు తక్కువ జీతంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వేతనం పెంచాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణ, జిల్లా నాయకురాలు జులేఖ, అబ్బాస్, పుల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

బనగానపల్లె రూరల్ : వ్యవసాయ సహాయకులు గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని ఏఓ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తన ఎంపిక నుంచి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

బేతంచెర్ల: మండలంలోని గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులు కాడి ఎద్దులను అలంకరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఏరువాక పౌర్ణమి వేడుకలకు మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ హాజరయ్యారు. గ్రామ రైతులు కాడె ఎద్దులను అలంకరించుకొని పూజలు నిర్వహించారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్యాపిలి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మాబాయి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పిల్లలను బడికి పంకుండా పనులు చేయించడం నేరం అన్నారు. బడికి పంపడం ద్వారా పిల్లల భవిష్యత్తు బాగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.